

నలదమయన్తీ ఉపాఖ్యానమ్

కథా విశ్లేషణా



అనువాదకులు: సత్యలక్ష్మీ బొర్రా

పరిశీలకులు: రమణయ్య దామెర, లలితా ఊలపల్లి, భ్రమరాంబా ఇనుమర్తి, దేవీ పువ్వాడ

విశ్లేషకులు: మీనా రెంటచింతల

June 2026

భారతాన్తర్గత నలదమయన్తీ కథా విశ్లేషణ:

వీరసేనుడు నిషాదరాజు. ఆయన కుమారుడు నలుడు. వీరసేనుడు [వ్రా వీరయతి ఆక్రామతి] నామరూపాత్మకమైన ప్రపంచంలోకి క్రమి-స్తూ ఉన్న ఇన్ద్రియైన్ద్రియార్థాలన్న సేన. నిషాద రాజ్యం = నిషాద [ని+సద్ విశరణగత్యవసాదనే] శిధిలమౌతూ, నశిస్తూ, తెలుసుకుంటూ ఉన్నది దేహము.

నలుడు = నరుడు (రలయోరభేధః). ఇక్కడ ఒక నరుడి కథ చెప్తున్నారు. నలుడిలో ధైర్యం, ధర్మం ఉన్నది. దానితోపాటు, రూపము, గుణము కూడా ఉన్నాయి. నామ, రూప, గుణాలను పెట్టుకుని, కర్మలను పట్టుకుని, జన్మను తెచ్చుకుని నరుడు అయ్యాడు.

పుష్కరుడు [ప్రా పిపర్తి పూరయతి] ఇన్ద్రియాలను విషయాలతో పూరిస్తూ ఉన్న ప్రపంచం. దీని చేతిలో ఓడిపోయాడు నలుడు.

కిరాతార్జునీయంలో శమమును సాధించడానికి మనసే అర్జునుడై వెళ్ళింది. ఇక్కడ దమమును సాధించడానికి మనసు నలుడై వచ్చింది. మనసు దేహేంద్రియాలకు తగులుకుని ఉన్నది.

దమము(దమయన్తి) విదర్భలో ఉన్నది. విదర్భ [విగతదర్భః దర్భలు లేకపోవడము] కర్మలు నశించి ఉండడం. దమము అంటే ఇన్ద్రియ ఉపరతి. కర్మలు చేస్తుంటే దమము కుదరదు. జ్ఞానము ప్రపంచానికి భీమము. ఈ జ్ఞానానికి కలిగినది భైమీ(దమయన్తీ). కర్మలు ఆగితే దమము(ఇన్ద్రియనిగ్రహము) కలుగుతుంది. నలుడు దమమును సాధించాలి, దాన్ని నిలబెట్టుకోవాలి. సాధకుడికి హంస (సోఽహం) జ్ఞానము దమమును కలిగిస్తుంది. దమము సాధకుని చేరవలసి ఉన్నది. లేకపోతే దమము ఉండి ఉపయోగము లేదు. హంసలు దమయన్తి గురించి నలుడిని ప్రేరేపించడమంటే సాధకుడికి దమము (ఇన్ద్రియనిగ్రహం) సాధించమని గురువులు ఉపదేశం చేసారు. కథలో హంసరాయబారం, దమయన్తీ స్వయంవరం అని నాటకీయంగా చెప్పారు.

శక్రుడు (అహంకారము విజ్ఞానాత్మ), అగ్ని (దేహము అన్నమయాత్మ), వరుణుడు (ప్రాణాలు ప్రాణమయాత్మ), యముడు (ఇన్ద్రియాలు ఇన్ద్రియాత్మ). తైత్తిరీయంలో చెప్పినట్టు ఇవన్నీ మూసపోసినట్టు ఒకేలాగా ఉంటాయి. అయితే దమము వీటిని వేరుచేసి చూడగలదు. దేవతలు నలునికి వరాలు ఇచ్చారు అని కథలో ఉన్నది. దమము(ఇన్ద్రియనిగ్రహము)ను సాధించిన సాధకునికే వరాలు వస్తాయి. ఆత్మానాత్మ వివేకము, వైరాగ్యము, యమ, నియమ, ఆసన, ప్రాణాయామములను సాధించిన సాధకునికి అష్టసిద్ధులు కలుగుతాయని మన శాస్త్రాలు చెప్తాయి.

తరువాత కథలో మన సాధకుడు ప్రపంచం పిలుస్తూ ఉంటే జారిపోయాడు. సాధకుడు దమమును పట్టించుకోకుండా, ప్రపంచంలోకి జారిపోతుంటే వార్ష్ణేయం [వృష్ హింసాయాం అధర్మాన్ని నిశింపచేసే ధర్మం] కూడా దూరమై పోతుంది. ధర్మం ఎప్పుడూ అయోధ్య [న+యుధ్ న యోద్ధుం శక్యః కర్మలచేత సాధించలేని ఆత్మస్థితి] లోనే ఉంటుంది. ఆత్మధర్మాన్ని దూరం చేసుకున్న సాధకుడు ఇప్పట్లో దాన్ని గెలవడం కష్టం. చాలా సాధన చేయవలసి ఉంటుంది.

ఏకవాసా ఒకే ఒక్క పలుచటి నేను అన్న వృత్తితో ఉండి దమమును పట్టించుకోవడం లేదు. ప్రాపంచిక వాసనలు చాల ఎక్కువ అయిన

సాధకుడి యొక్క ఇంద్రియాలు (అక్షములన్న శకునములు) ఆ పలుచటి ఆత్మవృత్తిని కూడా అపహరించుకునిపోయాయి. సాధకుడు దమమును పూర్తిగా వదిలిపెట్టి పారిపోయాడు.

ఇక దమయన్తిని కూడా తరువాత కథలో సాధకుడుగానే తీసుకోవాలి. సాధకుడిని (అజగరము) అవిద్యా అన్న నిద్రలో స్వప్నావస్థ పట్టుకుంటుంది. దాని నుండి బయటపడగానే (మృగవ్యాధః) మృగతృష్ణలతో ఉండేది జాగ్రదవస్థ పట్టుకుంటుంది. అందులో నుండి ఇంకా లోపలికి వెళితే (తాపసారణ్యం) సుషుప్తి అవస్థ ఉంటుంది. అక్కడ లోపలికి వెళ్ళిపోతే (అశోకం) శోకం లేని స్థితి ఉంటుంది. సాధకుడు ఈ మూడు అవస్థల్లోనే తిరుగుతూ ఉంటాడు. ఇందులో మహాసార్థంతో కూడి ఉంటాడు. పుట్టుకలు, సంపాదనలు, డబ్బులు అనుకుంటూ వ్యవహారాలతో కిటకిటలాడుతూ ఉంటుంది ప్రపంచమార్గం. ఇన్ద్రియభోగాలను అనుభవిస్తూ, ప్రమత్తతో ఉన్నవారిని (హస్తియూధము) మృత్యువు కబళిస్తుంది. పోయినవాళ్ళుపోతూ ఉంటారు, ఉన్నవారు కలిగినవాళ్లను తీసుకుని అదే భవాటవిలో అవే వ్యవహారాలలో పడిపోతూ ఉంటారు. దమము మాత్రము (బ్రాహ్మలను) బ్రహ్మమార్గములో ఉన్నవారితో కలిసి వెళుతుంది. దాని లక్షణాలు సైరంధ్రీ [సీరం హలం ధరతి తస్య భావః] వ్యవసాయము ఆత్మను అనాత్మల నుండి వేరుచేస్తూ ఉంటుంది. ఎవరు దమమును ధరిస్తారో వారిని దమము సేవిస్తుంది.

ఈలోగా ఇక్కడ నలుడిని కర్కోటకం అన్న పాము కాటు వేసింది. ఇంకొకరికి సహాయం చేయడమన్న ప్రతిఫలాపేక్షలేని ధార్మికకర్మ వల్ల నలునికి మార్గోపదేశం జరిగింది. సాధకుడికి దశ (direction సత్ వైపుకు) తిరిగింది. మళ్ళీ సన్మార్గం కనిపించింది. కాలము నలుడి (కర్మ)కి బాహుకుడు(బహు గా ఎన్నోగా ఉన్నవాడు) అని పేరు పెట్టి, అయోధ్యలో ఉన్న ఋతుపర్ణుడి దగ్గరకు పంపింది. ఋతుపర్ణుడికి [ఋషతి గచ్ఛతి, పిపర్తి పూరయతి జ్ఞానం] అక్షహృదయం (ఇన్ద్రియాలను అదుపులో ఉంచుకోవడం) తెలుసు. నలుడికి అశ్వహృదయం (ఇన్ద్రియాలను వాడుకోవడం) తెలుసు. ఇంతవరకు దమం ఉన్నా దాన్ని వాడుకునే జ్ఞానం లేక సాధకుడు ఇన్ద్రియనిగ్రహం కోల్పోయి ప్రపంచమార్గం పట్టుకుని నశించిపోయాడు. ఇప్పుడు అక్షహృదయం నేర్చుకుని, తిరిగి స్వారాజ్యం పొందవలసియున్నది. ఈ బాహుకుడు (వార్ష్ణేయజీవలౌ) ధర్మంతో, ప్రాణంతో జ్ఞానం దగ్గర ఉన్నాడు. మొత్తానికి అక్షహృదయం (ఇన్ద్రియ నియమనం) నేర్చుకున్నాడు.

ఇప్పుడు సుదేవం [సు+దీ దీవ్యతే జ్ఞానం] దమమును, పర్ణాదుడు [పౄ పిపర్తి పూరయతి కర్మ] సాధకుడిని కనుక్కున్నవి. బ్రాహ్మలు (జ్ఞానులు) నలదమయన్తులను (సాధకుడిని, దమమును) విదర్భలో (కర్మలు లేని స్థితిలో) కలిపాయి.

ఇక చివరగా, దమయన్తీతో కలిసి దమము (ఇన్ద్రియనిగ్రహం) సాధించిన సాధకుడు ఒకే ఒక్క పణంతో ఇన్ద్రియవిషయాలన్నింటితో కూడి ఉన్న ప్రపంచాన్ని జయించాడు. చివరకు రాజ్యాన్ని సాధించాడు.

అయితే సాధన ఇంకా పూర్తి అవ్వలేదు. సాధకుడు సామ్రాజ్యం, స్వారాజ్యం పొందవలసిఉన్నది. ఇదీ వ్యాసులవారు మనకు పారోక్ష్యంగా చెప్పిన నలదమయన్తులకథ యొక్క ఆధ్యాత్మికతత్త్వం.